

పేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న వీణ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య ఆర్తి

## పేదలకు దసరా కిట్లు పంపిణీ

తాండూరు, అక్టోబర్ 22: ఆత్మీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం తాండూరులో పేదలకు దసరా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య ఆర్తి మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా నిరుపేదలు దసరా పండుగను సంతోషంగా జరుపుకొనేందుకు నిత్యావసరాలను పంపిణీ చేసిన ఆత్మీయ సేవా సమితి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు రొంపల్లి సంతోష్‌కుమార్, బంటారం సుధాకర్, శ్రీనివాసాచారి తదితరులున్నారు.



పట్టణ శివారులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

కొడంగల్, అక్టోబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర, నియోజకవర్గ సరిహద్దులు, చెక్‌పోస్టులు, పట్టణ శివారుల్లో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి వాహనాన్ని కుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కొడంగల్ పట్టణ శివారులోని 163 హైవేపై తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ భరత్‌రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక సరిహద్దు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని, డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దేముల్, అక్టోబర్ 22 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం 2002-2003 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్నేహితులు ఒక చోట కలుసుకుని తమ చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సిద్ధాంత్, నాగరాజుగౌడ్, ఖాజాపాషా, బందెప్ప, అమర్‌నాథ్, రాములు, నరేందర్‌గౌడ్, అనిల్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 26 నుంచి చంద్రవంచ దర్గా ఉత్సవాలు

తాండూరు రూరల్, అక్టోబర్ 22 : చంద్రవంచ దర్గా ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 27 తేదీ వరకు జరుగనున్నాయి. తాండూరు మండలంలోని చంద్రవంచ సమీపంలో దర్గా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, సుదర్శన్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, అక్టోబర్ 22 : మండలంలోని కుస్మసముద్రం గ్రామానికి చెందిన పులి కొండయ్యకు స్నేహితులు ఆర్థిక సాయాన్ని అందించారు. ఇటీవల అనారోగ్యంతో కొండయ్య భార్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గండీడ్ మండలంలోని ఉన్నత పాఠశాలలో 1998-99లో టెన్త్ చదివిన తోటి స్నేహితులు అతడికి రూ. 1,65,000 అందజేశారు. ఈ మొత్తాన్ని కొండయ్య కోరిక మేరకు అతడి పిల్లల పేరున వారు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు వెంకన్నగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యయ్యగౌడ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## చర్చి పునర్నిర్మాణానికి విరాళం

మర్పల్లి, అక్టోబర్ 22: మండలంలోని కోట్‌మర్పల్లి గ్రామంలోని మెథడిస్టు చర్చి పునర్నిర్మాణంలో భాగంగా సర్పంచ్ విజయలక్ష్మీరాచయ్య చర్చి కమిటీ సభ్యులకు రూ. 50 వేలు అందజేశారు. అలాగే పీఏసీఎస్ చైర్మన్ రఘుపతిరెడ్డి, రిటైర్డ్ వీఆర్‌వో కృష్ణయ్యలు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్సింహులు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు జైహింద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రత్నయ్య, శ్రీశైలంగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి రాచయ్య, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు తహసిన్, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పూల సింగిడి

- అంబరాన్నంటిన సామూహిక బంగారు బతుకమ్మ వేడుకలు
- బతుకమ్మలను పేర్చి ఆడిపాడిన ఆడబిడ్డలు
- పులకించిన తాండూరు
- పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులు, ప్రజాప్రతినిధులు



తాండూరు: జనసంద్రంగా బతుకమ్మ ఉత్సవం

తాండూరు, అక్టోబర్ 22 : బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ చప్పట్ల దరువుల మధ్య సాగిన మధుప్రియ బతుకమ్మ పాటలకు వందలాది మంది ఆడబిడ్డల ఆటలు తోడై తాండూరు పులకరించింది. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సామూహిక బంగారు బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో పట్టణం గుబాలించింది. మహిళలు ఉయ్యాల, కోల్, చందమామ, గౌరమ్మ పాటలను లయబద్ధంగా పాడుతూ, చప్పట్లు కొడుతూ, చిందులేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం పట్టణ సమీపంలోని కాగ్నానదిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, భార్య ఆర్తి మాట్లాడుతూ ఆదిశక్తిని ప్రకృతి రూపంలో పూజించే పండుగనే బతుకమ్మ అని అన్నారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని, విశిష్టమైన తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పేదే బతుకమ్మ పండుగన్నారు. మహిళా అభివృద్ధి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహాయంను వివరించారు. ప్రజల ఆశీర్వాదం తమపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు, తాండూరు పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.



తాండూరు: సాయిపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కులకచర్ల మండలంలోని కుస్మసముద్రంలో..

### కులకచర్లలో..

కులకచర్ల : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. బతుకమ్మలను వివిధ పూలతో అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మ ఆడిపాడారు.

## కోకాపేటలో మల్టీప్లెక్స్

- సినిమా స్క్రీన్‌లతో పాటు షాపింగ్ కాంప్లెక్సు
- ఐటీ కారిడార్‌లో సరికొత్త ఆకర్షణగా నిర్మాణం

సిటీబ్యూరో, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా కోకాపేట గత కొంత కాలంగా 'టాక్ ఆఫ్ ది టౌన్'గా నిలుస్తున్నది. ఎకరం ధర వంద కోట్లకు పైగా పలకడం నగరంలోనే కాకుండా దేశ రియల్ ఎస్టేట్ రంగంలోనే కోకాపేటకు ప్రత్యేక స్థానం వచ్చింది. దీనికి తోడు ఐటీ కారిడార్‌లో ఎన్నో ప్రాంతాలున్నా ఇప్పుడు కోకాపేట హాట్‌స్పాట్‌గా మారింది. ఇలా ఎంతో ప్రాచుర్యం సొంతం చేసుకున్న కోకాపేటలో సరికొత్తగా మల్టిప్లెక్సు నిర్మాణం రానుంది. ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ నేతృత్వంలో కోకాపేట - నార్సింగి ప్రాంతంలో భారీ మల్టీప్లెక్సుతో పాటు సినిమా స్క్రీన్‌లు అత్యాధునిక శైలిలో నిర్మాణాలు జరగనున్నాయి. మెహిదీపట్నం నుంచి శంకర్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారిలో కోకాపేట జంక్షన్‌లో అల్లు స్టూడియోస్ ఆధ్వర్యంలో దీన్ని నిర్మించేందుకు ప్రాథమికంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. త్వరలోనే అనుమతులు వస్తే కోకాపేటలో మల్టీప్లెక్సు నిర్మాణం పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే కోకాపేట కేంద్రంగా 59 అంతస్థులతో కూడిన ఆకాశ హర్మ్యాలు పదుల సంఖ్యలో ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్నాయి. ఒకవైపు ఐటీ కార్యాలయాలు, నివాస ప్రాంతాలతో కోకాపేట నగర వాసులకు ఫేవరెట్ ప్లేస్‌గా మారింది. హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులతో పాటు విల్లా ప్రాజెక్టులు సైతం కోకాపేట పదుల సంఖ్యలో ఉండటంతో వారికి అవసరమైన సామాజిక అవసరాలపై కల్పనపై రియల్ ఎస్టేట్ సంస్థలు దృష్టి సారించాయి. ఇప్పటి వరకు మల్టీప్లెక్సు అంటే మాదాపూర్ ఇనార్బిట్ మాల్, కొండాపూర్‌లోని శరత్ క్యాపిటల్ మాల్‌కు వెళ్లాల్సి వచ్చేది. వాటి తర్వాత నానక్‌రాం గూడ, నార్సింగి, గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ ప్రాంతంలో అలాంటి లేకపోవడంతో కోకాపేట కేంద్రంగా మల్టీప్లెక్సు నిర్మాణం మరింత ప్రత్యేకతను సంతరించుకోనుంది. వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌తో పాటు వాక్ టు షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ అనే నినాదం కోకాపేట, దాని చుట్టు పక్కల ఉన్న ప్రజలకు అందుబాటులోకి రానుంది.

## శంకరన్ జీవన విధానం ఆదర్శప్రాయం

సిటీబ్యూరో, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ)/జూ బ్లీహిల్స్: ఎస్‌ఆర్ శంకరన్ నిరాడంబర జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని వక్తలు కొనియాడారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, ఎస్‌సి ఎస్‌టి ఆఫీసర్స్ ఫోర మ్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం 13వ ఎస్ ఆర్ శం కరన్ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్‌లోని దళిత్ స్టడీ సెంటర్ వేదికగా వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌యూ (న్యూ ఢిల్లీ) ప్రొ. నరేందర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ''భారత ప్రజాస్వామ్య ప్రయాణం-పరిశీలన-రా జ్యాంగ సభలో బాబా సాహెబ్ అంబేద్కర్ ముగింపు వ్యాఖ్యలు'' అన్న అంశంపై ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో మేఘాలయ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంపత్ కుమార్, నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్ కుమార్ పాల్గొని ఎస్‌ఆర్ శంకరన్ ఆయన పదవీ కా లంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల నిబద్దతను కొనియాడారు. సెంటర్ ఫర్ దళిత స్టడీస్ చైర్ పర్సన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఎస్‌ఆర్ శంకరన్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్స్‌లో చదువుకుంటూ పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన నల్గొండ జిల్లా విద్యార్థిని భాగ్యలక్ష్మికి ట్రాఫిక్ అదనపు సీపి సుధీర్ కుమార్ చేతులమీదుగా 'లక్ష్మి- వేణుగోపాల్ అవార్డు' కింద రూ. 10 వేల ఆర్థిక సహాయంతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు.